# లక్ష్యం ఆసియాగేమ్స్

**జాతీయస్థాయిలో నిలకడగా రాణిస్తున్న నిత్య ● ఏషియన్ టోర్నీ కోసం సన్నాహకాలు**




**జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో తెలంగాణ ప్లేయర్ నిత్య గంధె అదరగొడుతున్నది. టోర్నీ ఏదైనా పతకం పక్కా అన్న రీతిలో దూసుకెళుతున్నది. రేసు రేసుకు తన పరుగుకు మరిన్ని హంగులు అద్దుకుంటూ పతకాలు కొల్లగొడుతున్నది. ప్రత్యర్థులకు దీటైన పోటీనిస్తూ ముందుకు సాగుతున్న నిత్య వచ్చే ఏడాది చైనా వేదికగా జరిగే ప్రతిష్ఠాత్మక ఆసియాగేమ్స్ లక్ష్యంగా ఎంచుకున్నది. ఎలాగైనా ఆసియా క్రీడల్లో భారత్ తరఫున బరిలోకి దిగాలన్న పట్టుదలతో ఉన్న నిత్య ఆ దిశగా అడుగులు వేస్తున్నది. ఈ నెలాఖరులో కొరియాలో జరిగే ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ కోసం కేరళలో శిక్షణ పొందుతున్న ఈ హైదరాబాద్ అమ్మాయి.. నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు అంశాలు పంచుకుంది.**

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

### ఏషియన్ అథ్లెటిక్స్ టోర్నీకి సన్నద్ధత?

దక్షిణకొరియా వేదికగా ఈనెల 27 నుంచి మొదలయ్యే ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ కోసం ప్రస్తుతం కేరళలోని భారత క్రీడా ప్రాధికార సంస్థ(సాయ్)లో శిక్షణ తీసుకుంటున్నాను. కోచ్ శ్రీనివాసన్ సర్ ఆధ్వర్యంలో ట్రైనింగ్ కొనసాగుతున్నది. సీనియర్ స్థాయిలో నాకు ఇది తొలి అంతర్జాతీయ టోర్నీ. అందువల్ల ఎలాగైనా రాణించాలన్న పట్టుదలతో క్యాంప్‌లో చెమటోడుస్తున్నాను. గతానికి భిన్నంగా కేవలం ఫిజికల్ ఫిట్‌నెస్‌పైనే దృష్టి కాకుండా మానసికంగా బలంగా ఉండేందుకు కసరత్తులు చేస్తున్నాను. ఇంతకుముందులా కాకుండా లక్ష్యం చేరుకునేందుకు మనసును ప్రశాంతంగా ఉంచేలా యోగా సాధన చేయడం కలిసొస్తున్నది.

### జాతీయ స్థాయిలో రాణించడంపై?

జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తుండటం చాలా సంతోషంగా ఉంది. గతేడాది నుంచి కెరీర్‌ను మెరుగైన రీతిలో మలుచుకునేందుకు దృష్టి కేంద్రీకరించాను. ముఖ్యంగా టోర్నీకి టోర్నీకి ప్రదర్శనను మెరుగు చేసుకుంటూ ముందుకు సాగుతున్నాను. ఈ క్రమంలో ప్రత్యర్థుల నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకుంటూ పతకాలు సాధిస్తున్నాను. గతంలో చేసిన తప్పులు మళ్లీ పునరావృతం కాకుండా కోచ్ సలహాలు, సూచనలు పాటిస్తున్నాను. ఈ మధ్య బెంగళూరు, కొచ్చిలో జరిగిన జాతీయ అథ్లెటిక్స్ టోర్నీల్లో పతకాలు సాధించడం నాకు మరింత ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. తద్వారా 100మీ, 200మీటర్ల స్ప్రింట్‌లో దేశంలో టాప్ అథ్లెట్‌గా కొనసాగే అవకాశం లభించింది.

### ఏషియన్ అథ్లెటిక్స్‌లో పోటీపై?

కొరియాలో జరిగే ఏషియన్ అథ్లెటిక్స్‌లో చైనా, సింగపూర్, కొరియా అథ్లెట్ల నుంచి తీవ్ర పోటీ ఎదురయ్యే అవకాశముంది. ఫిట్‌నెస్, టైమింగ్ పరంగా వారు మన కంటే ఒకింత ముందంజలో ఉంటారు. కానీ గట్టి పోటీనిచ్చేందుకు భారత అథ్లెట్లు సిద్ధంగా ఉన్నారు. నా టైమింగ్ విషయంలో చాలా వరకు మెరుగయ్యాను. 100మీటర్ల రేసులో ప్రస్తుతం నా వ్యక్తిగత అత్యుత్తమ టైమింగ్ 11.41సెకన్లు కాగా, 200మీటర్ల రేసులో 23.36 సెకన్లుగా ఉంది. జాతీయ రికార్డు (11.17సె, 22.89సె)ను అధిగమించేందుకు అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నాను. వ్యక్తిగత స్ప్రింట్‌లో ప్రదర్శన ఆధారంగా టోర్నీలో 4X400 రిలే రేసులో భారత్ తరఫున పోటీ పడుతున్నాను.

### ప్రభుత్వ ప్రోత్సాహం ఎలా ఉంది?

జాతీయ స్థాయిలో నిలకడగా పతకాలు సాధిస్తున్నా..రాష్ట్ర ప్రభుత్వం నుంచి సరైన గుర్తింపు రావడం లేదు. ఇటీవల ఉత్తరాఖండ్ వేదికగా జరిగిన జాతీయ క్రీడల్లో తెలంగాణ తరఫున బరిలోకి దిగి మూడు పతకాలు సాధించాను. దీనికి తోడు బెంగళూరు, కొచ్చిలోజరిగిన ఫెడరేషన్ అథ్లెటిక్స్ టోర్నీల్లోనూ పతకాలు కొల్లగొట్టాను. కానీ ఇప్పటి వరకు సాట్స్ నుంచి ఆర్థిక ప్రోత్సాహం లభించలేదు.


## టీమ్‌ఇండియాను నిలువరించేందుకు..!

● సాథీకి కీలక బాధ్యతలు అప్పజెప్పిన ఇంగ్లండ్

లండన్: త్వరలో సొంతగడ్డపై భారత్‌తో జరుగనున్న ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో విజయం కోసం ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) భారీ ప్రణాళికలను రచిస్తున్నది. ఇందులో భాగంగానే టీమ్ ఇండియా బ్యాటర్లను నిలువరించేందుకు గాను ఆ జట్టు న్యూజిలాండ్ దిగ్గజ పేసర్ టిమ్ సాథీని స్పెషలిస్ట్ స్కిల్స్ కన్సల్టెంట్‌గా నియమించుకుంది. సాథీని ప్రత్యేకంగా భారత్‌తో సిరీస్ కోసమే ఎంపిక చేసినట్టు ఈసీబీ ఓ ప్రకటనలో తెలపడం గమనార్హం.

## రెండో రౌండ్ దాటని షట్లర్లు

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్ 500 టోర్నమెంట్‌లో భారత షట్లర్ల పోరాటం రెండో రౌండ్ కూడా దాటలేదు. సింగిల్స్ విభాగంలో 8 మంది, డబుల్స్ ఈవెంట్స్‌లో నాలుగు జంటలు బరిలో నిలిచినా ఒక్కరంటే ఒక్కరూ ముందంజ వేయలేక చతికిలపడ్డారు. పురుషుల సింగిల్స్ బరిలో ఉన్న ఏకైక ఆటగాడు తరుణ్ మన్నెపల్లి.. మహిళల సింగిల్స్‌లో మాళవిక, ఉన్నతి, ఆకర్షి కశ్యప్ ఇంటిబాట పట్టారు. మహిళల డబుల్స్‌లో త్రిసా–గాయత్రి జోడీ సైతం ఓడింది.



## సబలెంకకు షాక్

రోమ్: మహిళల టెన్నిస్‌లో ప్రపంచ నంబర్‌వన్‌గా ఉన్న అరీనా సబలెంకకు ఇటాలియన్ ఓపెన్‌లో చుక్కెదురైంది. ప్రతిష్టాత్మక ఫ్రెంచ్ ఓపెన్‌కు ముందు జరుగుతున్న ఈ టోర్నీ మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో సబలెంక.. 4–6, 3–6తో కిన్వెన్ జెంగ్ (చైనా) చేతిలో పరాభవం పాలైంది. 22 ఏండ్ల ఈ చైనా అమ్మాయికి కెరీర్‌లో సబలెంకపై ఇదే తొలి విజయం. ఎనిమిదో సీడ్ జెంగ్.. సెమీస్‌లో అమెరికా సంచలనం కోకో గాఫ్‌తో తలపడనుంది. పురుషుల సింగిల్స్‌లో అల్కారజ్ 6–4, 6–4తో డ్రాపర్(బ్రిటన్)ను ఓడించి సెమీస్‌కు దూసుకెళ్లాడు.

# టైటిల్ గెలుపే లక్ష్యంగా..

● డైమండ్ లీగ్ బరిలో నీరజ్‌చోప్రా

దోహా: భారత గోల్డెన్‌బాయ్ నీరజ్ చోప్రా..ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ పోరుకు సిద్ధమయ్యాడు. శుక్రవారం నుంచి ఖతార్ స్పోర్ట్స్ క్లబ్ వేదికగా మొదలుకానున్న డైమండ్ లీగ్‌లో టైటిల్‌ను తిరిగి దక్కించుకోవడమే లక్ష్యంగా నీరజ్ బరిలోకి దిగుతున్నాడు. డైమండ్ లీగ్‌లో రాణించడం ద్వారా సీజన్‌ను ఘనంగా ఆరంభించాలన్న పట్టుదలతో ఉన్నాడు. భారత్ నుంచి చోప్రాతో పాటు కిశోర్ జెనా పోటీపడుతున్నాడు. బాగా అచ్చొచ్చిన ఖతార్ స్పోర్ట్స్ క్లబ్‌లో స్థానిక ప్రవాస భారతీయుల నుంచి నీరజ్ భారీ మద్దతు లభించనుంది. ఈ మెగాటోర్నీలో పారిస్ ఒలింపిక్స్(2024) కాంస్య విజేత అండర్సన్ పీటర్స్, జాకబ్ వాల్డిచ్, జులియన్ వెబర్, జులియస్ యెగో, రోడ్రిక్‌క జెన్కిడీన్ నుంచి చోప్రాకు గట్టిపోటీ ఎదురుకానుంది. ఇదిలా ఉంటే పారిస్ ఒలింపిక్స్ పసిడి విజేత అర్షద్ నదీమ్(పాకిస్థాన్) డైమండ్ లీగ్‌లో పోటీపడటం లేదు.




### మేము ఎప్పటికీ ప్రాణ స్నేహితులం కాదు..

పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్‌తో స్నేహంపై భారత గోల్డెన్ బాయ్ నీరజ్‌చోప్రా స్పష్టతనిచ్చాడు. నదీమ్, తాను ఎప్పటికీ ప్రాణ స్నేహితులం కాదని చోప్రా పేర్కొన్నాడు. పహల్గాం ఉగ్రవాద దాడి తర్వాత తన పేరిట ఏర్పాటు చేసిన టోర్నీకి నదీమ్‌ను ఆహ్వానించిన చోప్రా తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నాడు.

## డబ్ల్యూటీసీ విజేతకు 30 కోట్లు

**ప్రైజ్‌మనీ ప్రకటించిన ఐసీసీ**

దుబాయ్: ఇంగ్లండ్ వేదికగా మరో నెల రోజుల వ్యవధిలో మొదలుకానున్న ప్రతిష్టాత్మక ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ)లో ఈసారి జట్లకు అదిరిపోయే రీతిలో ప్రైజ్‌మనీ దక్కనుంది. వచ్చే నెల 11 నుంచి లార్డ్స్‌లో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య జరుగనున్న డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్ కోసం ఐసీసీ గురువారం ప్రైజ్‌మనీ ప్రకటించింది. ఈ ఏకైక టెస్టులో గెలిచిన జట్టుకు రూ.30.79 కోట్లు, రన్నరప్ టీమ్‌కు రూ.18.47 కోట్లు దక్కనున్నాయి. ఇక మూడో స్థానంలో నిలిచిన టీమ్ ఇండియాకు 12.31 కోట్లు ఖాతాలో చేరనున్నాయి. గత రెండు సార్లతో పోలిస్తే ఈసారి 13.67 కోట్లు ఎక్కువ కావడం విశేషం. 'టెస్టు క్రికెట్‌కు మరింత ప్రాధాన్యం ఇవ్వాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నాం. ప్రైజ్‌మనీ పెంచడం ద్వారా టెస్టుల పట్ల మాకు ఉన్న చిత్తశుద్ధి ఏంటో తెలుస్తుంది' అని ఐసీసీ పేర్కొంది.

# రీస్టార్ట్‌కు రంగం సిద్ధం

**జట్లతో కలుస్తున్న విదేశీ ఆటగాళ్లు**

**రేపటి నుంచే ఐపీఎల్ పునఃప్రారంభం**



ఢిల్లీ: వారం రోజుల వాయిదా అనంతరం ఐపీఎల్ పునఃప్రారంభానికి రంగం సిద్ధమైంది. శనివారం నుంచి ఈ సీజన్ (బెంగళూరు X కోల్‌కతా మ్యాచ్‌తో) తిరిగి ప్రారంభం కానుంది. భారత్, పాకిస్థాన్ ఉద్రిక్తతలతో తమ స్వదేశాలకు వెళ్లిపోయిన విదేశీ ఆటగాళ్లు ఒక్కొక్కరుగా తమ ఫ్రాంచైజీలతో కలుస్తున్నారు. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, వెస్టిండీస్ క్రికెటర్లు భారత్‌కు తిరిగొచ్చారు. జోస్ బట్లర్, కగిసో రబాడా (గుజరాత్) గురువారమే జట్టుతో చేరారు. ఆర్‌సీబీ ఆటగాళ్లు ఫిల్ సాల్ట్, లివింగ్‌స్టొన్, బెతెల్‌తో పాటు టిమ్ డేవిడ్, రొమారియా షెపర్డ్ బెంగళూరుకు చేరుకున్నారు. మార్క్‌రమ్, మిల్లర్, పూరన్, జోసెఫ్ మరో రెండు రోజుల్లో లక్నోతో కలిసే అవకాశమున్నట్టు ఫ్రాంచైజీ వర్గాలు ధృవీకరించాయి. మే 19న లక్నో.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్ ఆడాల్సి ఉండగా ఆలోపు వీళ్లు లక్నో జట్టుతో కలిసే అవకాశముంది. హైదరాబాద్ సారథి కమిన్స్‌తో పాటు ట్రావిస్ హెడ్ కూడా నేడో రేపో భారత్‌కు రానున్నారు. మిచెల్ స్టార్క్ రాకపై అనిశ్చితి కొనసాగనుండగా ట్రిస్టన్ స్టబ్స్, డుప్లెసిస్ త్వరలో ఢిల్లీ క్యాపిటల్స్‌తో చేరనున్నారు.

### గాయాలు.. మార్పులు..

ఆరు నెలల విరామం తర్వాత ఇటీవలే రీఎంట్రీ ఇచ్చిన స్పీడ్‌గన్ మయాంక్ యాదవ్‌కు మళ్లీ గాయమైంది. వెన్నునొప్పితో మయాంక్ మిగతా సీజన్‌కు దూరమవడంతో లక్నో అతడి స్థానాన్ని కివీస్ పేసర్ విలియమ్ ఓరూర్క్‌తో భర్తీ చేసింది. సీజన్ ఆరంభంలోనే గాయపడ్డ పంజాబ్ పేసర్ లాకీ ఫెర్గూసన్ ప్లేస్‌ను.. న్యూజిలాండ్‌కే చెందిన కైల్ జెమీసన్ రిప్లేస్ చేయనున్నాడు. ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా ప్లేయర్లు ప్లేఆఫ్స్‌కు అందుబాటులో ఉండటం లేకపోవడంతో ఆ జట్లూ రిప్లేస్‌మెంట్స్‌పై దృష్టి సారించాయి. గుజరాత్‌కు ఆడుతున్న బట్లర్.. లీగ్ దశ ముగియగానే స్వదేశానికి వెళ్లనుండటంతో టైటాన్స్ ఆ స్థానంలో కుశాల్ మెండిస్ (శ్రీలంక)ను తీసుకుంది. విల్ జాక్స్ స్థానంలో జానీ బెయిర్ స్టో (ఇంగ్లండ్) భర్తీ చేయనున్నట్టు సమాచారం.

## ఢిల్లీ క్యాపిటల్స్‌కు బాయ్‌కాట్ సెగ

**బంగ్లా ఆటగాడిని తీసుకోవడంపై నెటిజన్ల ఆగ్రహం**

ఆసీస్ బ్యాటర్ జేక్ ఫ్రేసర్ మెక్‌గర్క్ స్థానంలో బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను తీసుకోవడంపై ఢిల్లీ క్యాపిటల్స్ 'ఎక్స్'లో నెటిజన్ల ఆగ్రహానికి గురైంది. ఇటీవల కాలంలో బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, ఆ దేశ నాయకులు భారత్‌పై చేస్తున్న వివాదాస్పద వ్యాఖ్యలు, ఈశాన్య రాష్ర్టాలను స్వాధీనం చేసుకోవాలంటూ మాట్లాడుతున్న అక్కడి రాజకీయ నాయకుల తీరుపై భారత్‌లో ఆగ్రహం వెల్లువెత్తుతున్నది. కొన్ని నెలల క్రితం ముగిసిన ఐపీఎల్ వేలంలోనూ ఫ్రాంచైజీలు బంగ్లా ఆటగాళ్లపై విముఖత వ్యక్తం చేశాయి. కానీ తాజాగా టెంపరరీ రిప్లేస్‌మెంట్స్‌లో ఢిల్లీ.. ముస్తాఫిజుర్‌ను తీసుకోవడంతో నెటిజన్లు క్యాపిటల్స్ యాజమాన్యంపై దుమ్మెత్తిపోస్తున్నారు. దీంతో గురువారం ఎక్స్‌లో #బాయ్‌కాట్ ఢిల్లీ క్యాపిటల్స్ ట్రెండ్ అయింది. తాజా వివాదంపై క్యాపిటల్స్ స్పందించలేదు.

# షెఫాలీ పునరాగమనం

**ఇంగ్లండ్‌తో సిరీస్‌లకు జట్లను ప్రకటించిన బీసీసీఐ**

**హైదరాబాదీ పేసర్ అరుంధతి రెడ్డికి చోటు**



ఢిల్లీ: టీమ్‌ఇండియా విధ్వంసకర ఓపెనర్ షెఫాలీ వర్మ ఏడు నెలల విరామం తర్వాత తిరిగి జాతీయ జట్టులో చోటు సంపాదించింది. వచ్చే నెలలో ఇంగ్లండ్‌తో జరుగబోయే ఐదు టీ20లు, మూడు వన్డేల సిరీస్‌ల కోసం బీసీసీఐ గురువారం జట్లను ప్రకటించింది. వన్డేలలో షెఫాలీకి మరోసారి నిరాశే ఎదురైనా టీ20 జట్టులో మాత్రం చోటు దక్కింది. పేలవమైన ఫామ్‌తో నిరుడు అక్టోబర్‌లో ఆమె జట్టుకు దూరమైంది. దేశవాళీ అదరగొట్టిన ఆమె.. మార్చిలో ముగిసిన ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో 304 పరుగులు చేసి సత్తాచాటింది. షెఫాలీతో పాటు వికెట్ కీపర్ బ్యాటర్ యస్తికా భాటియా కూడా జట్టులోకి రీఎంట్రీ ఇచ్చింది. టీ20, వన్డే జట్టులోనూ సెలెక్టర్లు ఆమెకు చోటు కల్పించారు. ఈ ఇద్దరూ మినహాయిస్తే ఇటీవల శ్రీలంక, దక్షిణాఫ్రికాతో జరిగిన ముక్కోణపు వన్డే సిరీస్‌లో పాల్గొన్న భారత జట్టులోని ఆటగాళ్లు తమ స్థానాలను నిలుపుకున్నారు. హైదరాబాదీ పేసర్ అరుంధతిరెడ్డికి రెండు ఫార్మాట్లలోనూ చోటు దక్కింది. ముక్కోణపు సిరీస్‌లో అరంగేట్రం చేసిన మరో తెలుగమ్మాయి శ్రీచరణి సైతం వన్డే, టీ20 జట్లకు ఎంపికైంది.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.